# మసాలా

చిన్న కొడుక్కి ఇద్దరు పిల్లలు. పెద్ద వాడికి ఇంత వరకూ పిల్లలు లేరు. తల్లి మనస్సు ఎలా ఉంటుంది? పరమ వికారంగా ఉంది రాజేశ్వరికి. అందుకే తిరుపతిలో వచ్చి వాలింది.

వాసు తెగ సంబర పడ్డాడు. "దేవుణ్ణి చూడ్డానికైనా తిరుపతి రావే..." అంటే... "మీ నాన్నే నా దేవుడు ఆయన ఉన్న చోటే నా పుణ్యక్షేత్రం..." అంటూ వైజాగ్ వొదిలి రాని తల్లి హఠాత్తుగా తిరుపతి వచ్చేసిం దంటే పరమానందమే.

"అరేయ్ చిన్నా...పెద్దాడి రెండో కొడుకు బారసాలకి నువ్వు వస్తా వనుకున్నాను... రాలేదేంరా? బెంగపడి పోయానురా నాన్నా... నేనే వచ్చేశాను..." అని సంజాయిషీ చెప్పుకుని చిన్న కోడలిని తెగ పరామర్శలు చేసింది రాజేశ్వరి.

"ఏమ్మా...ఉద్యోగం కష్టంగా ఉందా? పోనీ మానెయ్యా రాదూ? ఆడవాళ్ళు ఉద్యోగాలు చెయ్యడం మీ మామ గారికి బొత్తిగా సరి పడదు... ఇంటి పనికి నీకు తోడైనా ఎవరూ లేరు... ఇల్లేమో అడివిలో ఉంది... అమ్మో ఎంత దూరం!... అన్నట్టు....ఇక్కడికి పులులు కూడా వస్తుంటాయట కదా?..."

తిరుపతి కొండ కొస పక్కన మంగళం అనే ప్రాంతంలో ఇల్లు. ప్లాటు కొని కట్టించేశాడు వాసు.

ఏడేళ్ళుగా టీటీడీ కాలేజీలో ఉద్యోగం. ఉద్యోగంలో చేరిన సంవత్సరానికే జానకితో పెళ్ళి. ఆమెకు ప్రైవేట్ ఫ్యాక్టరీలో స్టెనో ఉద్యోగం. ఇద్దరూ ప్రొద్దున్నే చెదిరి పోతారు. సాయంత్రానికి గూడు చేరుకుంటారు. ఆర్థికంగా బాగానే ఉంది. అతను కొందరు స్నేహితులతో కలిసి ఇండ్ల స్థలాల వ్యాపారంలో పెట్టుబడి పెట్టాడు. క్షణం తీరిక ఉండదు. కొంచెం వెసులు బాటు ఉన్నప్పుడల్లా తండ్రికి వైజాగ్‌కి డబ్బు పంపుతాడు. బడిపంతులుగా పదవీ విరమణ చేసి అక్కడే ప్రశాంత జీవితం గడుపుతున్న విష్ణువర్ధన రావు సముద్రం ఉన్న ఊరు వదిలి ససేమిరా

కదల నంటాడు. పెద్ద కొడుకు తిరుపతి వచ్చెయ్య మన్నా చిన్న కొడుకు హైదరాబాద్ వచ్చి విశ్రాంతి తీసుకొమ్మన్నా ఆయన రాజేశ్వరీ సమేతంగా వైజాగ్ లోనే ఉండి పోతాడు. ఎవరి తృప్తి వారిది.

"మరి ఇంతకీ ఈ ఇంట్లో చిన్ని కృష్ణుడు దోగాడేది ఎప్పుడర్రా?" అని రాత్రి భోజనాల దగ్గర నిస్పృహగా అన్నది పరమేశ్వరి. "నాలుగేళ్ళకే చిన్నోడు ఇద్దర్ని కన్నాడు...మరి మీరు ఇలాగే ఉండి పోతే... నలుగురూ నాలుగు రకాలుగా అనుకోరా?" అని వ్యాఖ్యానిస్తూ కొడుకునూ కోడల్నీ ఓరకంట కనిపెట్టింది.

వాళ్ళ ముఖాలు వాళ్ళ ముఖాల వలెనే ఉన్నాయి. ఏ భావాలూ కదిలి అఘోరించ లేదు. రాజేశ్వరి మనస్సులో అనుమానాలు సుడి తిరిగాయి. కొంపదీసి వీళ్ళలో ఎవరికైనా ఏ లోపమైనా ఉందా? కొంపదీసి వీళ్ళ కొంప వీళ్ళే తీసుకుంటున్నారా? ఇప్పుడప్పుడే పిల్లలూ గట్రా ఎందుకూ అనుకున్నారా? సరదాలూ సరసాలూ ఇంకా తీర లేదని రబ్బరు తొడుగులో మాత్రలో వాడుతున్నారో ఏమో! పైకి ఇలా చక్కగా ఆదర్శ దంపతుల్లా కనిపిస్తున్నారు కాని వీళ్ళ మధ్య రవరవలూ చిటపటలూ ఏవైనా ఉన్నాయేమో! ఆలూమగలమే గాని పడగ్గదిలో మాత్రం నిప్పూ ఉప్పే అని వీడేమైనా భీషణ ప్రతిజ్ఞ చేశాడేమో!

"ఏరా వాసూ... తమ్ముడికి పెళ్ళయి నాలుగేళ్ళే... ఇద్దరు పిల్లలయ్యారు... అయిదున్నరేళ్ళుగా కాపురం చేస్తున్నా మీ కడుపున కాయ పడలేదూ అంటే.." అని రాజేశ్వరి దీర్ఘం తీస్తుండగానే కోడలు జానకి కొసరు సిగ్గులు వదలనట్టు ముడుచుకు పోతూ "మా ఫ్రెండ్స్ కూడా అలానే అడుగుతున్నా రత్తయ్యా... అదేమిటో... లేటవుతోంది మరి..." అని నవ్వుకున్నది. అంటే లోకాపవాదు రానే వచ్చిందన్న మాట!

"అరే అబ్బాయ్... ఇలా అడుగుతున్నా నని ఏమీ అనుకోకూ... కొంపదీసి... నీకు గానీ కోడలు పిల్లకు గానీ... ఏదైనా లోపం లాంటిదీ..." అని సాగ దీసింది...తల్లి మనస్సు ఉండబట్ట లేక.

వాసు వ్యవహారజ్ఞుడు కద. మొహమాట పడలేదు. నాన్చలేదు. "అలా మాకూ సందేహం వచ్చిందమ్మా... ఇద్దరం డాక్టర్ల చేత అన్ని పరీక్షలూ చేయించు కున్నాం... ఇద్దరిలో ఎవ్వరికీ ఎక్కడా ఎటువంటి లోపమూ లేదు... మరి పిల్లలెందుకు కలగడం లేదూ అంటే... ఆ టైము రాలేదన్న మాటే... నువ్వే అంటూ ఉంటావే....అలాగా... ఆ దేవుడు చల్లగా చూడలేదేమో... మరి

కూలింగ్ గ్లాసులు దొరకలేదేమో!..."

"కూలింగ్ గ్లాస్ లేమిట్రా?"

"దేవుడు గారు కూలింగ్ గ్లాస్‌లు తగిలించు కుంటేగా... మమ్మల్ని చల్లగా చూడ్డానికీ!..."

ఆహా!ఎంత హాస్య చతురుడు కన్న కొడుకు! రాజేశ్వరి తికమక పడింది. నిజంగా దేవుడికే కూలింగ్ గ్లాస్‌లు దొరకడం లేదా? లేక వీళ్ళ చూపుల్లోనే ఏదైనా దోషం ఉందా?

రాత్రి నిద్ర పట్టక పొర్లుతూ మథన పడింది రాజేశ్వరి. డబుల్ బెడ్‌రూం ఇల్లు. మార్బుల్ ఫ్లోరింగ్. టేక్ ఫర్నిచర్. వాడికో స్కూటర్. కోడలికి కైనటిక్ హెూండా. ఎన్ని ఉండి ఏమి లాభం?

"అరేయ్ అబ్బాయ్ ఈ పాలరాతి గచ్చు మీద నీ కొడుకు ఉచ్చ పడక పోతే అంతా వేస్టురా!" అని స్వగతంగా నిష్ఠూరం చేస్తూనే ఉలిక్కి పడింది రాజేశ్వరి.

నవ్వులు శబ్దాలు సంగీతం...అలలు అలలుగా తోసుకొచ్చి వినిపించాయి. అదేమిటా అనుకుంటూ తలుపు వారగా చూస్తే నట్టింట హాలులో టీవీ నడుస్తోంది. సరిగ్గా అప్పుడే మ్యూజికల్ గడియారం పన్నెండు కొట్టింది. కొడుకూ కోడలూ ఇద్దరూ హాలులోనే ఉన్నారు. కాస్సేపటికే... రంజుగా సాగుతోంది సినీ శృంగార గీతాల ప్రోగ్రాం... మిడ్‌నైట్ మసాలా. పాపం పగలంతా ఇద్దరూ డ్యూటీలూ బాధ్యతలతో అలిసిపోయి ఉంటారు. ఇటువంటి సరదాలూ అవసరమే అనుకున్నది రాజేశ్వరి.

అయితే హైదరాబాద్‌లో చిన్నవాడి ఇంట్లో పద్ధతి వేరు. భోజనాలయి కాస్సేపు టీవీ కాస్సేపు కాలక్షేపం కబుర్లూ కాగానే సరిగ్గా పదింటి కల్లా టీవీ ఆఫ్! లైట్లు బంద్! మరి మహానగరంలో బ్రతకడ మంటే మాటలా? ప్రొద్దున కల్లా ఉరుకులూ పరుగులూ...

పూర్వం పల్లెటూళ్ళలో సూర్యుడు క్రుంకే ముందే భోంచేసి బుడ్డి దీపపు వెల్తురులో పడకలు చేరుకునే రోజులు మళ్ళీ ఎలా వస్తాయి? ప్రపంచంలో ఎవరికైనా ఎలా వస్తాయి?

అప్పట్లో పండక్కో తిరణాలకో హరికథలంటే బుర్రకథలంటే వీధినాటకాలంటే అదో మోజు. ఇప్పుడు ప్రతి రాత్రి ప్రతి నిమిషం నాటకమే

సినిమాయే...అంతా రంగుల మాయే!

నిద్ర పడుతూ చెదురుతూ ఉండగా మంచి నీళ్ళకని లేచి వెళ్ళిన రాజేశ్వరి హాల్లో ఇంకా టీవీ ముందే ఉన్న జానకిని చూసి ఆశ్చర్యపోయింది.

"అదేంటమ్మా ఇంకా పడుకోలేదూ?"

"మంచి ఇంగ్లీషు సినిమా అత్తయ్యా...వారం రోజులుగా ప్రయత్నిస్తుంటే ఇప్పటికి దొరికింది సీడీ...చూడండి గ్రాఫిక్స్ చూడండి...అబ్బ వండర్‌ఫుల్..."

"ఆఁ...నాకేం అర్థం అవుతుంది లేమ్మా...మరి అబ్బాయి పడుకున్నాడా?"

"ఆఁ...ఇందాకే వెళ్ళి పోయారాయన...సగం సినిమా కూడా చూళ్ళేదు ...అదిగో ఆయన గురకే!... అత్తయ్యా చూడండీ...ఇది...ఇదండీ సినిమా అంటే ...ఫొటోగ్రఫీ చూడండీ..."

టీవీ నుంచి తల తిప్పడం లేదు జానకి. కళ్ళు అసలు అటు నుంచి కదలడం లేదు. తడిపొడిగా మాట్లాడుతున్న కాస్సేపూ చేతిలో మంత్రదండంలా పుచ్చుకునే ఉంది...రిమోట్ కంట్రోల్!

రాజేశ్వరి మెదడులో తళతళా మెరుపులు మొదలయ్యాయి. మిడ్‌నైట్ మసాలా తర్వాత సీడీ వేసుకుని సినిమా చూడ్డమా? పడకగదిలో అబ్బాయి గురక పెట్టడమా? ఓరి దేవుడా! వీళ్ళని నువ్వెలా చూస్తావయ్యా? చల్లగా ఎలా చూస్తావయ్యా? నీ కళ్ళకి చలువ జోళ్ళు లాభం లేదు. వీళ్ళ కళ్ళకే తగిలించుకున్నారు పిక్చర్ ట్యూబ్‌లు...

నిద్ర కాచి కనిపెడుతూనే ఉంది పరమేశ్వరి. రెండు కొట్టాక కాస్సేపటికి టీవీ బంద్ అయ్యింది. కోడలు పడగ్గది లోకి వెళ్ళింది. ఆ తలుపైనా గట్టిగా వేసుకున్నట్టే లేదు. వీళ్ళకి ఇదంతా యంత్రాల తంతులా అలవాటై నట్టుంది. ఉండబట్ట లేక రాజేశ్వరి నెమ్మదిగా లేచి వెళ్ళి సోఫాలో పడుకుంది. తప్పో ఒప్పో తెలీదు. పెద్ద కొడుకు కాపురం ఏమాత్రం సక్రమంగా నడుస్తోందో అని తహతహ.

పల్లెటూళ్ళో అయితే ఎన్నెన్నో పద్ధతు లుంటాయి. ఎవరో ఒకరు అన్నీ కూపీ లాగి అతి రహస్యం సుమా అని అందరికీ చాటింపు వేస్తారు. నాగరికం పెరిగి పోయింది గనుక ఇప్పటి దంపతుల ముచ్చట్లు నాలుగ్గోడల మధ్యే గప్‌చుప్.

"హబ్బ...ఉండండీ...ఛ...వొద్దిప్పుడూ...నిద్రొస్తోంది...కళ్ళు మండు తున్నాయి..." అంటోంది కోడలు. ఇంకా ఏమి ఉంటుంది శృంగారం? టీవీ

బొమ్మలూ గ్రాఫిక్సూ తలతిక్క డాన్సులతో మనస్సు నిండి పోయింది. తనివి తీరిపోయింది.

ఊహించు కుంటూనే ఉండి పోయింది రాజేశ్వరి. టీవీ వదిలి వెళ్ళిన కోడల్ని దగ్గరికి తీసుకోవాలని ఆరాట పడుతుంటాడు వాసు. ఆమె చిరాకుతో దూరం చేస్తూనే ఉంటుంది.

కాస్సేపటికే నిశ్శబ్ద మైపోయింది. చీకటిలో గుసగుసలు లేవు. గాజుల సవ్వడి లేదు. వేడి నిట్టూర్పులు లేవు. మంచం తియ్యగా మూలగడం లేదు. చీకటి చీకటే. రసమూ లేదు. శృంగారమూ లేదు.

ఊరవతల కాబట్టి ఎక్కడో అక్కడ ఒకటో అరో కోళ్ళు ఉన్నాయి. తెల్లారే ముందు ఓపిక చేసుకుని కూశాయి. రాజేశ్వరి చెవుల్లో చీకటి గుసగుసలు మెత్తగా సోకాయి. కోడలి గొంతే. మాటలు అవసరం లేదు. అర్థం కానవసరం లేదు. ఆడ గొంతులో సరిగమలు అద్భుతంగా పలుకుతాయి. కాని కొడుకు గొంతులో మాత్రం చిరాకు దాగడం లేదు. "అబ్బా...పడుకోవే...మాంచి నిద్ర ..చెడగొట్టకు...ఆఁ...పడుకో...పో..."

అదీ వరస. అప్పుడు అమ్మగారు అలిశారు. ఇప్పుడు అయ్యగారు సొలిశారు. ఎట్లా కుదురుతుందా అని??

వరసగా మూడు రాత్రులు కనిపెట్టే సరికి అసలు వరసేమిటో తేటతెల్ల మైపోయింది. అంతా అదే వరస. టీవీ వరస. సినిమాల వరస. సీడీ ప్లేయర్ వరస. డాక్టర్లూ టెస్ట్‌లూ ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు. వీళ్ళు చదువుకున్న మూర్ఖులు. యంత్రాలకు దాసులు. వీళ్ళకు చెప్పి చెడ్డ కావడం తప్ప లాభమేమీ ఉండదు. అయితే వంశవృక్షం నిలబడాలీ అంటే ఏదో మంత్రమో తంత్రమో పడాలి! అంతా ఆలోచించు కున్నాక ఓ నిర్ణయానికి రానే వచ్చింది రాజేశ్వరి. కొడుకూ కోడలూ డ్యూటీలకు వెళ్ళగానే వైజాగ్‌కి ఫోన్ చేసింది.

"ఈశ్వరీ ఏమిటిది? నా మీద ఎందుకింత కోపం? నా కెందుకీ తాపం? స్వయం పాకంతో అఘోరిస్తున్నాను...ఇక నా వల్ల కాదు...ఇంతకీ ఏమయిం దక్కడ? ఇన్ని రోజు లేమిటి?..." అని గగ్గోలు పెట్టేశాడు విష్ణువర్ధనరావు.

"కష్టమో నిష్ఠూరమో మీరూ నేనూ భరించక తప్పదు. నాకిక్కడో రాచకార్యం పడింది..." అంటూ అంతా చెప్పుకొచ్చింది రాజేశ్వరి.

"అరె...ఎదిగిన పిల్లలు...వాళ్ళ బాగోగు లేవో వాళ్ళకు తెలీదా? మన

కెందుకు...నువ్వు వచ్చేద్దూ..." అన్నాడు విష్ణు.

"ససేమిరా రాను... పెద్ద కొడుకంటే తమాషానా?...ఎప్పటికైనా వంశానికి వాడే దిక్కు...వాడి కొడుకును కళ్ళ జూడకుంటే ఈ జన్మ వృథా కదా...నేనింకా ఓ వారమో పది రోజులో ఇక్కడ ఉండే వస్తాను...నన్ను తలుచుకుంటూ మీరు చేతులు కాల్చుకోండి...మరేమీ ఫరవా లేదు...నేను వచ్చి మందు రాస్తాను...ఈలోగా మీరో మాట సాయం చెయ్యాలి...తప్పదు..."

"హత విధీ..."

సాయంత్రం వాసు రాగానే అడిగాడు "అదేమిటమ్మా నాన్నగారు ఇక్కడికి ఫోన్ చేశారట...ఎంతసేపటికీ ఎంగేజ్ వస్తోందట...ఫోన్ సరిగ్గా పెట్టలేదేమో... ఆయన నాకు కాలేజీకి ఫోన్ చేశారు..."

"ఏమన్నార్రా?"

"వెంటనే బైల్దేరి ఢిల్లీ వెళ్తున్నారట...వృద్ధ పండితుల ప్రతినిధి వర్గంట... వెళ్ళి ప్రధానిని కలుస్తారట... దేశ సమైక్యత సమగ్రతల గురించి వినతి పత్రం సమర్పిస్తారట..."

"ఇంకేం...దేశం బాగుపడి పోతుంది! మరి ఆయన లేకుంటే అక్కడికి వెళ్ళి నేనేం చేయాలట...?"

"అదే చెప్పారు...వారం తర్వాత...వైజాగ్ వచ్చాక ఫోన్ చేస్తారు అప్పుడు నువ్వు వెళ్ళొచ్చు..."

"అమ్మో నాకిక్కడ తోచదు...మీరిద్దరూ ఆఫీసులకి వెళ్ళిపోతారు ... ఇదసలే అడివిలో ఇల్లు...నాకేం తోస్తుందీ ఇక్కడ?..."

జానకి కలకలా నవ్వేసి రిమోట్ తీసి రాజేశ్వరి చేతిలో పెట్టింది.

"మంత్రాల పెట్టె లాంటి టీవీ ఉండగా మాయా దర్పణం లాంటి సీడీ ప్లేయర్ ఉండగా మనకేం తక్కువ? హాయిగా కేబుల్ టీవీ చూస్తూ కూచోం డత్తయ్యా...మీ కిష్టమైన భక్తి సినిమాల సీడీలు కూడా తెచ్చిస్తా...దర్జాగా ఎంజాయ్ చెయ్యండి..."

అదీ దివ్య సందేశం! కోడలా మనవణ్ణి ఇవ్వవే అంటే బొమ్మల పెట్టె ఇస్తాను ఆడుకొమ్మంటోంది! ఎంత నాగరికం!

చూసినంత సేపూ టీవీ చూడనే చూసింది రాజేశ్వరి. కళ్ళ నొప్పు

లొచ్చాయి గాని మనస్సు నిండలేదు. డ్యూటీలకు వెళ్ళిన కొడుకూ కోడలూ వచ్చీ రాగానే మళ్ళీ టీవీ భూతం ముందు పడతారు. షరా మామూలు. జీవితమే వృథా అయిపోతుంది. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూ ఉండి చివరికి ఎలా చెయ్యాలో కూడా నిర్ణయించుకుంది రాజేశ్వరి.

ముద్దొచ్చే టీవీ ముప్పై వేలకి పైగానే ఉంటుంది. సీడీ ప్లేయర్ మరో అయిదు వేలు. రెండూ బద్దలు కొట్టేస్తే సరిపోతుంది. కాని అంత పని చెయ్య రాదు. కొంచెం ఘాటు కొంచెం సున్నితం...అలా చెయ్యాలి పని.

ఆడది తలుచుకుంటే అట్లకాడ తోనే ఏదైనా చెయ్యవచ్చు. వంటింటి నుంచి అట్లకాడని తెచ్చుకుని టీవీ ముందు నిలబడి మనస్సు రాయి చేసుకుంది రాజేశ్వరి. తప్పదు. చెయ్యక తప్పదు...

వాసూ జానకీ సాయంత్రం ఒకేసారి ఇంటికి వచ్చి రాజేశ్వరి వాలకం చూసి భయపడి పోయారు. "అలా ఉన్నా వేంటమ్మా? ఏమైందీ?" అని వాసు అడిగే సరికి అమాంతంగా ఏడుపు ముఖం పెట్టి చెయ్యెత్తి టీవీ వైపు చూపెట్టింది రాజేశ్వరి. మరుసటి క్షణం జానకి కెవ్వుమన్న కేక ప్రతిధ్వనించింది.

"అయ్యొ అయ్యొ...ఏమైందమ్మా?" అని గగ్గోలు పడ్డాడు వాసు. టీవీని పట్టి పట్టి చూశాడు. నొక్కి నొక్కి చూశాడు.

టీవీ మీద డెక్‌లో బటన్‌లు అన్నీ వంకరటింకరగా ఎగుడు దిగుడుగా జామ్ అయిపోయాయి. ఒక బటన్ స్థాన భ్రంశం చెందింది. కింద పడింది. అది ఉండ వలసిన చోట మెటల్ పిన్ బోసి పన్నులా వెక్కిరిస్తూ ఉంది.

"అయ్యో అయ్యో..." అని ఆక్రోశిస్తూ రిమోట్‌తో టీవీ ఆన్ చెయ్యాలని రకరకాలుగా ప్రయత్నించింది జానకి. టీవీ ఉలక లేదు పలక లేదు. మౌనవ్రతం పట్టిన దయ్యంలా ఉండి పోయింది.

ఏడుపు దిగమింగుతూ భయపడుతూ దిగులుపడుతూ వర్ణించి చెప్పింది రాజేశ్వరి: "మీరు వెళ్ళాక నేను టీవీ చూస్తున్నానా... కాస్సేపటికి ఛానల్ మార్చబోతే మారలేదు...రిమోట్ పాడయిందేమోనని...టీవీలోనే మారుద్దామని బటన్‌లు నొక్కాను... రెండో బటన్ నొక్కుకు పోయింది...అట్ల కాడతో ప్రయత్నించాను... దాంతో మూడోది ఊడొచ్చేసింది...అన్నీ సరిగ్గా మళ్ళీ పెట్టెయ్యవచ్చని... వరసగా సర్దుతూ నొక్కాను చూడూ...అదేమిటో...అలా అయిపోయింది...ఏరా అబ్బాయ్... ఈ టీవీకి గ్యారంటీ ఉందా?...కంపెనీ వాడే బాగు చేసిస్తాడు కద!?"

నవ్వాలా? ఏడవాలా? వాసూ జానకీ తలలు పట్టుకున్నారు. రాజేశ్వరిని తిట్టలేదుగాని విసుక్కున్నారు.

"అట్ల కాడతో రిపేర్ ఏంటమ్మా...మేము వచ్చేదాకా ఆగొచ్చుగా?..."

"ష్!...ముందు జరగాల్సింది చూడండి..." అన్నది జానకి. "టీవీ రిపేర్‌కి ఎవరైనా మెకానిక్‌నో ఇంజనీర్‌నో చూడండి...వెంటనే చూడండి... టీవీ లేకుంటే రాత్రికి కష్టం..."

"అవును కష్టమే" అంటూ వెంటనే స్కూటరేసుకుని రివ్వున వెళ్ళిపోయాడు వాసు. గంటన్నరకి బాగా పొద్దుపోయాక తిరిగొచ్చి "చుట్టు పక్కల ఎవ్వరూ లేరు...రేపు ట్రై చేసినా టౌన్ నుంచి ఇక్కడికి ఏ ఇంజనీరూ రాడు...మనమే టీవీని పట్టుకెళ్ళి...అప్పజెప్పి...చేయించుకోవాలి...అంతే!" అన్నాడు.

అలా పడింది టీవీకి బ్రేక్.

రాత్రి భోజనాలయ్యాక అప్పుడు మొదలైంది అసలు ఆరాటం. దిక్కు తోచక పోవడం అంటే ఏమిటో జానకికీ వాసుకీ ఒకేసారి తెలిసొచ్చినట్టుంది. ఇద్దరూ ఏదో చెప్పుకోబోతారు. మానేస్తారు. టీవీని తిట్టుకుంటారు. ఇంజనీర్లని తిట్టుకుంటారు. మెకానిక్‌లని తిట్టుకుంటారు. రాజేశ్వరిని లోలోపల తిట్టు కుంటారేమో గాని పైకి మొహమాటపడి తల తిప్పుకుంటారు. "టేప్ అయినా పెట్టండి...మ్యూజిక్ అయినా విందాం..." అంది పదకొండు గంటలకి జానకి.

"దాంట్లో మోటార్ చెడిందని మూల పడేశాం...మరిచి పోయావా? నన్ను డిస్టర్బ్ చెయ్యకు...నవల చదువు కుంటాను..." అంటూ పుస్తకంతో బెడ్‌రూంలో దూరాడు వాసు.

"పోన్లెండత్తయ్యా...టీవీ గురించి మీరేమీ బాధ పడకండి...ఒక్కోసారి టైము బాగులేకుంటే అంతే...మీరు పడుకోండి...మీరు పడుకోండి..." అని రాజేశ్వరికి పక్క సర్దిపెట్టి వెళ్ళిపోయింది జానకి.

గడుగ్గాయి రాజేశ్వరి గప్‌చుప్‌గా పడుకుందేగాని నిద్ర పోలేదు. ఓ చెవి అటు పడేసి ఉంది. మ్యూజికల్ గడియారం పన్నెండు కొడుతూ ఉండగా బెడ్‌రూం నుంచి ధ్వనులు మారిపోయాయి. కాలక్షేపం కబుర్లు చెట్టెక్కాయి. గుసగుసలు మొదలయ్యాయి. గాజులు గలగల మన్నాయి. తరువాత కువకువలు. చీకటికే కోరిక పెరిగినట్టు బుసబుసలు. హఠాత్తుగా దభేల్‌మని బెడ్‌రూం తలుపు మూత పడింది. నాలుగు రోజులుగా పరమేశ్వరి కనిపెడుతూనే ఉంది. అలా

తలుపు ఎప్పుడూ మూత పడనే లేదు. ఇప్పుడే అది బెడ్‌రూం అయినట్టు అనిపించింది.

ఇటుక గోడలు కాంక్రీటు పైకప్పు చెక్క తలుపులు...వీటన్నిటినీ దాటుకుని కూడా కొన్ని మధుర శబ్దాలు ఎలాగో బైటికి వచ్చేస్తాయి. సరసాల సరదాల కథలన్నీ ఇట్టే తెలిసిపోతాయి. తెల్లార్లూ నవ్వుకుంటూనే ఉంది పరమేశ్వరి. గర్వంగా నవ్వుకుంటూ ఉంది...

మరుసటి రోజు మరో ఎత్తుగడ కూడా వేసింది రాజేశ్వరి. "అబ్బాయ్... మీరిద్దరూ డ్యూటీలకు వెళ్ళే వాళ్ళే...బొత్తిగా పని లేకుండా ఉన్నది నాకే కదా... మీరేమీ బెంగ పడకండి...మన టీవీని రిపేర్ చేయించు కొచ్చే డ్యూటీ నాది...నేను చెడగొట్టాను కాబట్టి నేనే బాగు చేయిస్తాను...నేనే టీవీని ఆటోలో తీసుకెళ్తాను..." అని కార్యభారం కాస్త నెత్తిన వేసుకుంది.

దాంతో దంపతులిద్దరూ పరమానందం చెందాను. కన్నతల్లే టీవీ పాలిటి విలన్ అవుతుందని వాళ్ళెలా ఊహించగలరు? వాళ్ళటు డ్యూటీలకు వెళ్ళగానే టీవీని ఆటోలో ఊళ్ళోకి తీసుకెళ్ళింది పరమేశ్వరి.

బాగా వెతికి వెతికి పాడయిన టీవీలు పేరుకు పోయిన ఓ సర్వీసింగ్ సెంటర్‌లో తమ టీవీని దించింది. ఇంజనీర్‌ను పక్కకు పిలిచి అయిదు వందల నోటు చేతిలో కుక్కి నర్మగర్భంగా చెప్పి అభ్యర్థించింది: "ఈ టీవీని తొందరగా బాగు చెయ్యకండి...మీ దగ్గర ఇచ్చానని మా అబ్బాయికి చెప్తాను. వాడు ఎన్ని సార్లయినా తిరిగి పోనీ...దీన్ని మాత్రం కనీసం రెండు మూడు వారాల దాకా కండిషన్‌లో పెట్టకండి..."

"అయ్యో...అలా ఎందుకండీ?..."

"మా కొంప మునక్కుండా ఉండడానికి!..."

మరుసటి రోజున రాత్రి భోజనాలు ఇంకా తొందరగా ముగిశాయి. కోడలి ముఖంలో తొందర తొందరగా కదులుతున్న నీడల్ని ఇట్టే పసిగట్టింది రాజేశ్వరి.

"అమ్మాయ్...నువ్వు తెలుగుపద్యాలు చక్కగా చదువుతావు కదా... భారతంలో ఏదైనా ఘట్టం చదివిపెడుదూ...నాకు బొత్తిగా నిద్ర రావడం లేదు..."

"ప్లీజ్...అత్తయ్యా...ఏమీ అనుకోకండి...ఆఫీస్‌లో టైపింగ్ ఎక్కువై

నడుము లాగేస్తోంది...రేపు చదివి పెడతాను అత్తయ్యా..." అంటూ నడుము నొప్పి స్పష్టంగా నటిస్తూ బెడ్‌రూం లోకి దూరింది జానకి.

"ప్రొద్దున్నే కాలేజీలో స్టాఫ్ మీటింగ్ ఉందమ్మా...పెందరాళే లేవాలి నేను..." అంటూ వాసు కూడా అటే వెళ్ళాడు.

వెంటనే నిర్మోహమాటంగా మూత బడింది ఆ తలుపు. ఆ వెంటనే సుతి మెత్తటి నేపథ్య శబ్దాలతో మొదలైంది మిడ్‌నైట్ మసాలా!

వాసు రోజూ కాలేజీకి వెళ్ళేప్పుడూ తిరిగొచ్చేప్పుడూ కూడా టీవీ సర్వీసింగ్ సెంటర్‌లో వాకబు చేస్తూనే ఉన్నాడు. బటన్‌లు దొరకడం లేదు సార్. కంపెనీ నుంచి తెప్పిస్తున్నాం...ఇవ్వాళ్ళ మా అసిస్టెంట్ లీవ్ సార్...అస్సలు ఏమీ తెమలడం లేదు...

ఇక టీవీ లేని ఇంట్లో కాలక్షేపం ఏముంటుంది? బెడ్‌రూంలే గతి!...

టీవీ పాడైన ఎనిమిదో రోజున కోడలి ముఖంలో ఆందోళన చూసి ఆరా తీసింది రాజేశ్వరి.

"ఆc...ఏమీ లేదత్తయ్యా..."

"పెద్దదాన్ని...చెప్పూ..."

"ఎంత లేదన్నా మొన్నటికే...కావాలి...కాలేదు..."

"ఆc..."

గుడి గంటలు మోగాయి. మరుసటి రోజుకి నిర్ధారణ అయిపోయింది.

కూరలకని బైటికెళ్ళి వైజాగ్‌కి ఫోన్ చేసింది రాజేశ్వరి. "మీరిక ఢిల్లీ నుంచి వచ్చేయండి స్వామీ! నన్ను పిలిపించుకోండి...వచ్చేస్తాను..."

"ఇంతకీ ఏమైందీ...రాచకార్యం?"

"పండు"

–టీవీ ఏమైందా? ఏదో అవుతుంది. మన కెందుకు? ఈ కథ చదివిన విన్న దంపతులు తప్పని సరిగా స్వంత మిడ్‌నైట్ మసాలాకు.... శుభం!